క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలి



నూజివీడు: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో జరిగిన వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అగ్నిప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే దగ్గరలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా వంట గదుల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. గృహాల్లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తక్షణమే విద్యుత్ సరఫరాను నిలిపివేయాలన్నారు. పాఠశాలలు, సినిమా హాల్‌లు, హోటళ్లు, గోదాములు, గిడ్డంగులు, ఫ్యాక్టరీలు, తదితర చోట్ల అగ్నిప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ డి.మత్తయ్య, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చిన్నారులకు అన్నప్రాసన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం):పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా కొండపల్లి బొమ్మల కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐసీడీఎస్ ఈవో సాయిగీత, మైలవరం సీడీపీవో పుష్పలత పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. పక్షోత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన జరిపారు. గర్భిణులకు సీమంతం చేశారు. సెక్టార్ సూపర్ వైజర్ జి.రమాదేవి, కార్యకర్త శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకునికి జాతీయ అవార్డు



మైలవరం: డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు మెండా దేవానంద కుమార్‌కు జాతీయ ప్రతిభ పురస్కారం–2025 అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి సోమవారం తెలిపారు. సాత్రస్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ అవార్డును అంబేడ్కర్ జయంతి సందర్భంగా బోధన వృత్తిలో విశేష ప్రతిభ కనబర్చిన వారికి బహూకరిస్తారన్నారు. ఈ ఏడాది అంబేడ్కర్ పై ప్రత్యేక పుస్తక రచనతో పాటు విద్యార్థులకు నూతన సర్టిఫికెట్ కోర్సులను పరిచయం చేసినందుకు గాను నిర్వాహకులు ఎంపిక చేసినట్లు తెలిపారు. గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో నేడు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ మెండా దేవానంద కుమార్‌ను మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, కేఎస్ లక్ష్మణరావు అభినందించారు. కార్యక్రమంలో దక్షిణ బారతదేశం నలుమూలల నుంచి ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

వృత్తివిద్య కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం):మూలపాడు జెడ్పీ పాఠశాలలో వృత్తి విద్య కోర్సులు చేస్తున్న 9, 10 తరగతుల బాలికలకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం సోమవారం నిర్వహించారు. నర్సరీలో నిర్వహించిన కార్యక్రమాన్ని సమత స్టేట్ బోర్డు డీసీడీవో మూర్తి, జిల్లా డీసీడీవో అనురాధ, సెంట్రల్ బోర్డు సభ్యురాలు దీపిక పర్యవేక్షించారు. వృత్తి విద్యా కోర్సులు విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతున్నాయని తెలిపారు. మొక్కల పెరుగుదల, వాటి పోషణ, ఎరువులు, నీటి వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. కోఆర్డినేటర్ వెంకన్న, ఒకేషనల్ ట్రైనర్ నాన్సీ, హెచ్‌ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్ పాల్గొన్నారు.

విస్సన్నపేటలో గ్రామసభ

విస్సన్నపేట: అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి అధ్యక్షతన గ్రామసభ సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించి గ్రామసభను ప్రారంభించారు.

దళితుల ఆరాధ్య దైవం బీఆర్ అంబేడ్కర్

మాజీ మంత్రి జోగి రమేష్

ఇబ్రహీంపట్నం:దళితుల ఆరాధ్యదైవం, ప్రపంచం గర్వించదగిన వ్యక్తి బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ అని మాజీ మంత్రి, మైలవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జోగి రమేష్ తెలిపారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి బీకాలనీ వద్ద వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున బీఆర్ అంబేడ్కర్ భారీ నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేసి సముచిత గౌరవం కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, జికొండూరు జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, మేడపాటి నాగిరెడ్డి, ఎస్సీ విభాగం నాయకులు పచ్చిగోళ్ల పండు, మిక్కిలి శరభయ్య నల్లమోతు దయాకర్, ఎస్.ప్రకాష్, కోలకాని శ్రీనివాసరావు, బాణావత్ బాలాజీ, బాడిశ నాగరాజకుమారి, గరికపాటి రాంబాబు, ఎంఏ. బేగ్ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: సాంఘిక సమానత్వం కోసం, అంటరానితనం, అస్పృశ్యత నిర్మూలన కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం పాటుపడిన గొప్ప ధీశాలి రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం బీఆర్ అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి మేకా ప్రతాప్ పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, కౌన్సిలర్లు మీర్ అంజాద్‌అలీ, నవుడు నాగమల్లేశ్వరరావు, తుక్కులూరు సర్పంచ్ తొమ్మండ్రు బుజ్జి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్, నాయకులు ఎదురేశి ఎరగయ్య, సలుమూరి మూర్తి, యార్లగడ్డ చంటి, ఆరేపల్లి రాంబాబు, యర్రంశెట్టి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం:స్థానిక ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. పలువురు ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్ఐ విజయలక్ష్మి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. నాయకులు కోట దానియేలు మాదిగ, విజయ్ మాదిగ, నల్లమోతు లక్ష్మీ పాల్గొన్నారు. దొనబండలో సీబీటీయు ఆధ్వర్యంలో క్వారీ కార్మికులు అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. మండల కార్యదర్శి ఎం.మహేష్ పాల్గొన్నారు. కొండపల్లిలో డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు హాజరయ్యారు.



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగి రమేష్



నూజివీడులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేకా ప్రతాప్ అప్పారావు

ముసునూరు: నిమ్నవర్గాల బతుకులు మార్చేందుకు జీవితాన్నే అంకితం చేసి, బడుగులకు బంధువుగా బాబా సాహెబ్ అంబేడ్కర్ నిలిచారని జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ స్టేట్ జాయింట్ సెక్రటరీ కంబాల రాంబాబు, స్టేట్ హిస్టరీ అకాడమీ మాజీ డైరెక్టర్ పెదగర్ల స్వరూపరాణి తెలిపారు. మండల వ్యాప్తంగా సోమవారం అన్ని గ్రామాల్లో బీఆర్ అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. వేల్పుచర్ల తూర్పు, పడమర దళితవాడల్లో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించి, అన్నదానం చేశారు. గ్రామ సర్పంచ్ మోహన్‌రావు, ఎంపీటీసీ సుబ్బారావు, సీనియర్ వైద్యుడు బాబూరావు, పలురంగాల ప్రముఖులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. కాట్రేనిపాడు ఉత్తర దళితవాడలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. పోలీస్ స్టేషన్లో ఎస్సై ఎం.చిరంజీవి, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, సీనియర్ సహాయకుడు సగ్గుర్తి శ్రీనివాస్, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు తదితరులున్నారు

మైలవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు అసమానమైనవని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జి. వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు, నాయకులు తిరుపతిరావు, ఇస్లావత్ స్వామి, పాలా నారాయణరెడ్డి, బుర్రి ప్రతాప్, యేసు, ఎన్.ఆజాద్, వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఇంకొల్లు జమలయ్య, యలవర్తి నాగరాజు, కొండల రామారావు, ఓలేటి యేసు, దూరు దాసు తదితరులు పాల్గొన్నారు. గణపవరం, పొందుగల, వెల్వడం, పుల్లూరు, మొర్సుమల్లి తదితర గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని డాక్టర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

మహనీయుడు అంబేడ్కర్



తిరువూరులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్వామిదాసు తదితరులు

తిరువూరు:డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ భావితరాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగంలో రిజర్వేషన్లు ప్రతిపాదించారని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో, బోస్ సెంటర్లో, పాతతిరువూరు గాజులమాలపల్లిలో నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు స్వామిదాసు, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, తిరువూరు మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు తాళ్ళూరి నవీన్‌కుమార్, చలమాల సత్యనారాయణ, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, కాకర్లమూడి సుందరకుమార్, గుంటూరు మస్తాన్, పార్టీ నాయకులు రేగళ్ళ మోహన్‌రెడ్డి, షేక్ జాకీర్, బండి రవికుమార్, గోపాల నాగేశ్వరరావు, వెలుగోటి ఆదినారాయణ, సీతారామయ్య, యరదేశి రామారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ మాజీ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. పోతనపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కారంగుల వాసు తదితరులు పాల్గొన్నారు. సూరంపాలెంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో మోటారు బైక్ ర్యాలీ నిర్వహించి అన్నదానం చేశారు. పోలీస్ స్టేషన్లో ఎస్ఐ రామకృష్ణ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చనుబండ, జనార్థనవరం, చాట్రాయి, పోలవరం, చిన్నంపేట, తుమ్మగూడెం గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

నూజివీడు: ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకుని ప్రపంచ మేధావిగా ఎదిగిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి అన్నారు. పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఆర్ హనుమాన్లు శ్రీనివాస సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నెప్రహాపేటకు చెందిన అంబేడ్కర్ యువజన సంఘం నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ నిలువెత్తు చిత్రపటాన్ని పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బీఆర్ అంబేడ్కర్ –గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):అణగారిన వర్గాల ఆశాజ్యోతి బీఆర్ అంబేడ్కర్ అని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. కొండపల్లిలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షమ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం జరిగిన బీఆర్.అంబేడ్కర్ జయంతిలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌తో కలసి ఆమె పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థునులు ప్రదర్శించిన గిరిజన నృత్యం ఆకట్టుకుంది. ఎంఈవో పుష్పలత, ప్రిన్సిపాల్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎల్‌బీఆర్‌సీఈ ట్రస్టీ డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి. శివహరిప్రసాద్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

జి.కొండూరు: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని జి.కొండూరు సినిమాహాలు సెంటర్లో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు (జక్రి), వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ రాంబాబు, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు, కేడీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు వేములకొండ రాంబాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని కొత్తూరు తాడేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు అభివృద్ధి పనులపై మాట్లాడారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పైడూరుపాడు గ్రామ సర్పంచ్ వేమూరి సీతారామయ్య అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాయనపాడు సర్పంచి కాటంనేని కళ్యాణి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముసునూరు: నిమ్నవర్గాల అభివృద్ధి, సమసమాజ స్థాపన కోసం జీవితాన్నే పణంగా పెట్టి, ప్రపంచంలోనే చరిత్ర సృష్టించిన మేధావి, మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. ముసునూరు, బడుగువారిగూడెంలో స్థానిక అంబేడ్కర్ యువత, పెద్దల ఆధ్వర్యంలో నిర్మించిన నూతన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం రాత్రి పలువురు దళిత నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, స్టేట్ హిస్టరీ అకాడమీ మాజీ డైరెక్టర్ స్వరూపరాణి, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు తులిమెల్లి సుబ్బారావు తదితరులున్నారు.

విస్సన్నపేట: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ పిల్లి మెరిసి వనజాక్షి అన్నారు. స్థానిక అంబేడ్కర్‌సెంటర్లో బహుజన దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి, ఐక్యవేదిక అధ్యక్షులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి కొండ రాజకుమార్, ఎంపీడీఓ చిన్న, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, ఐక్య వేదిక నాయకులు గొర్రె లాజరస్, పల్లె పాము లక్ష్మయ్య, ఐక్యవేదిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక బీజేఆర్ యూత్ ఆధ్వర్యంలో, పుట్రేల సౌత్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో, మీట్టగూడెం బీఆర్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

ఆగిరిపల్లి:రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని హైకోర్టు న్యాయవాది పాలేటి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద అంబేడ్కర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్సై శుభ శేఖర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈదరలో భీమ్‌రావు దళిత సేవా సంఘం అధ్యక్షుడు మొగుదాటి జోజి బాబు అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. అనంతరం భారీ బైక్ ర్యాలీ జరిపారు. సీపీఎం మండల కార్యాలయంలో శివ నాగరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిన్నమరెడ్డిపల్లిలో సర్పంచ్ జాల భూషణం ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లిలో స్థానిక భాగ్యలక్ష్మి ఇండియన్ గ్యాస్ నిర్వాహకులు పాలడుగు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మిఠాయిలు, మజ్జిగ పంపిణీ చేశారు.



జి.కొండూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ హనిమిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు



ముసునూరులో అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్



విస్సన్నపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



వేల్పుచర్ల పడమటి దళితవాడలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



మైలవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పోతనపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దేశిరెడ్డి



నూజివీడులో బీఆర్ అంబేడ్కర్ నిలువెత్తు చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం




కొండపల్లి బాలికల గురుకుల పాఠశాలలో నివాళులర్పిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

కూటమి నేతల్లో విభేదాలు బహిర్గతం

ఇబ్రహీంపట్నం:టీడీపీ నాయకులు తీరుతో కూటమి నేతల్లో విభేదాలు బయట పడ్డాయి. ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో సోమవారం బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో జనసేన నేతలు దూరమయ్యారు. ఆహ్వానం లేకపోవడంతో వేరుగా పోటీ కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూతలపాటి బాల కోటేశ్వరరావు ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జ్ అక్కల గాంధీకి ఆహ్వానం లేకపోవడంతో అదే సమయంలో కొండపల్లి బీసీ కాలనీ వద్ద పోటీగా అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏపీ గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో మంత్రి సంధ్యారాణి పాల్గొన్న కార్యక్రమానికి కూడా జనసేన నేతలకు ఆహ్వానంలేక దూరంగా ఉన్నారు. ఆదివారం కొండపల్లిలో జరిగిన సాయిబాబా మందిరం ప్రతిష్ఠలో కూడా జనసేన నేతలకు ఆహ్వానం అందలేదు. పూజా కార్యక్రమాలు పూర్తిచేసి వెనుతిరిగిన ఎమ్మెల్యే వసంతకు జనసేన నేత అక్కల గాంధీ ఎదురు రావడంతో మరలా రెండోసారి పూజలో పాల్గొని మమ అనిపించారు. ఈ పరిణామాలు జనసేన నాయకులు తీవ్ర అవమానంగా భావిస్తున్నట్లు తెలిసింది. రాబోయే రోజుల్లో కూటమి నేతల మధ్య మరెన్ని పరిణామాలు, పోటీ కార్యక్రమాలు చోటుచేసుకుంటాయో వేచిచూడాలి.

పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న నాప్ క్యాబ్ డైరెక్టర్ రాఘవేంద్రరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం సాధ్యమని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కో ఆపరేటివ్ న్యాంక్స్(నాప్ క్యాబ్) డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. కార్మిక వర్గాల మధ్య పాలకులు, రాజకీయ పార్టీలు, కార్పొరేట్ శక్తులు చిచ్చుపెట్టి స్వార్థ ప్రయోజనాల కోసం చీలికలు తెచ్చే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. కార్మికులు బలహీనంగా ఉంటే యాజమాన్యం ముంగిట బలహీనపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏపీ సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల సంఘం వజ్రోత్సవ వేడుకలు రెండో రోజు సోమవారం ముగిశాయి.

సహకార చట్టాన్ని కాపాడుకోవాలి..

ముఖ్య అతిథిగా పాల్గొన్న రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. కేంద్ర పాలకుల నిరంకుశ విధానాల వల్ల సహకార బ్యాంకులు పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. కార్పొరేట్ వర్గాలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చేందుకే కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లు భారీగా తగ్గిస్తోందని చెప్పారు. షెడ్యూలు బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్ముకు భద్రత లేదని, కార్పొరేట్ ఎగవేత దారులకు లక్షల కోట్ల రూపాయలు రుణ మాఫీ చేస్తున్నారన్నారు. ఈ 2025 సంవత్సరాన్ని సహకార సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిందని, 1904లో వచ్చిన సహకార చట్టం మన అందరిదని, దానిని కాపాడుకునే బాధ్యత మన పైనే ఉందని చెప్పారు. విశ్రాంత ప్రభుత్వ అధికారి డి.చక్రపాణి మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, డిజిటల్ రంగాన్ని సహకార బ్యాంకుల సిబ్బంది అలవర్చుకోవాలన్నారు.

అకాల వర్షంతో అపార నష్టం..

- పంటలకు నష్టం వాటిల్లిన వైనం
- పెనుగాలులతో కురిసిన వర్షం
- కొన్నిచోట్ల నేలకొరిగిన వరిపంట, మామిడికాయలు
- కూలిపోయిన పామాయిల్ చెట్లు



తిరువూరు మండల పరిధి అక్కపాలెం గ్రామంలో నేలకొరిగిన వరి పంట



ఏ.కొండూరు మండల పరిధిలో నేలరాలిన మామిడి కాయలు

తిరువూరు(జి.కొండూరు): పగలు ఎండ తీవ్రత, రాత్రైతే గాలితో కూడిన వానలు రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. వరుసగా పడుతున్న అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తిరువూరు, గంపలగూడెం, విసన్నపేట, ఏ.కొండూరు మండలాల్లో ఆదివారం రాత్రి పెనుగాలులతో కూడిన అకాల వర్షం విధ్వంసం సృష్టించింది. ఈ మండలాల్లో గంటపాటు కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోగా మామిడి, వరి, ఉద్యాన పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారు. అక్కడక్కడా కోతలు పూర్తయి కల్లాల్లో ఉన్న ధాన్యం, కాటాలు పూర్తయి లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. పలు గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నేలకొరిగింది.

నియోజకవర్గంలో పరిస్థితి ఇలా....

తిరువూరు నియోజకవర్గంలోని తిరువూరు మండల పరిధిలో 817 హెక్టార్లలో మామిడి సాగవుతుండగా గంపలగూడెం మండల పరిధిలో 616 హెక్టార్లు, ఏ కొండూరు మండల పరిధిలో 2336 హెక్టార్లు, విసన్నపేట మండల పరిధిలో 5,817 హెక్టార్లలో మామిడి సాగవుతుంది. ఈ నెల 7వ తేదీన వచ్చిన అకాల వర్షానికి 50 శాతానికిపైగా మామిడి కాయలు రాలిపోగా ఆదివారం రాత్రి వీచిన గాలి వర్షానికి మరో 30 శాతం వరకు కాయలు రాలినట్లు తెలుస్తుంది. ఆదివారం సాయంత్రం వీచిన పెనుగాలులు, వర్షానికి తిరువూరు నియోజకవర్గ పరిధిలో పామాయిల్ 200 చెట్లు, నిమ్మ 15 చెట్లు పడిపోగా, పందిరి కూరగాయలు 5 హెక్టార్లు, అరటి 1హెక్టారుకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు అంచనాలు తయారు చేశారు. అదేవిధంగా మైలవరం నియోజకవర్గ పరిధిలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు మండలాల పరిధిలో పదిశాతం మామిడి కాయలు నేలరాలినట్లు అధికారులు చెబుతున్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

ఆగిరిపల్లి: మండలంలోని వట్టిగుడిపాడు దళితవాడలో విద్యుదాఘాతంతో రేకుల షెడ్డు దగ్ధం కావడంతో వస్తువులు కాలి బూడిదయ్యాయి. బాధితుల కథనం మేరకు యలమర్తి సుగుణమ్మ, తన భర్తతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంటి బయట పనులు చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి ఇల్లు మొత్తం కాలిపోయింది. ఇంట్లోని సామగ్రి అంతా కాలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారుగా రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

తాత్కాలిక, సాధారణ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యూనియన్ బ్యాంక్‌లో గత దశాబ్ద కాలంగా పనిచేస్తున్న తాత్కాలిక, సాధారణ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ధర్నా చౌక్‌లో తాత్కాలిక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించారు.

సారా విక్రేత అరెస్టు

ముసునూరు: చిల్లబోయినపల్లిల్లో సారా విక్రయిస్తున్న పామర్తి శేఖర్‌ను అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య సోమవారం తెలిపారు. ఎక్సైజ్ ఎస్సైలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ దాడులు చేసినట్లు చెప్పారు. దాడిలో నూజివీడు సిబ్బంది పాల్గొన్నారు.